www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
06 నవంబర్ 2025
సంపుటి:3 సంచిక: 310

# విశాల భారతి


తెలుగు దినపత్రిక






# నేడే బీహార్ పోలింగ్

## బీహార్‌లో నేడు మొదటి దశ పోలింగ్



- మొత్తం 243 స్థానాలకు ఎన్నికలు
- మొదటి దశలో 121 స్థానాలకు పోలింగ్
- నవంబర్ 11న రెండో దశ పోలింగ్
- నవంబర్ 14న ఫలితాలు వెల్లడి
- పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి
- 50,000కి పైగా పోలింగ్ స్టేషన్లు

**విశాలభారతి, నేషనల్:**

బీహార్ రాష్ట్రంలో 2025 అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్ నేడు జరగనుంది. మొత్తం 243 స్థానాలకు జరిగే ఈ ఎన్నికల్లో మొదటి దశలో 121 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 122 స్థానాలకు నవంబర్ 11న రెండో దశ పోలింగ్ ఉంటుంది. ఫలితాలు నవంబర్ 14న వెల్లడవుతాయి. నవంబర్ 4 సాయంత్రం 6 గంటలకు మొదటి దశకు సంబంధించిన ప్రచారం ముగిసింది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకారం ఈ దశలో వాల్మీకి, పూర్ణియా, కోసీ, మగధ, తరై, ఉడా మొదలైన ప్రాంతాల్లోని 20 జిల్లాల్లో 121 స్థానాలు కవర్ అవుతాయి. కీలక స్థానాల్లో గయా (వజీర్‌గంజ్), మధుబనీ,

:మిగతా 2లో..

# 25 లక్షల ఓట్ల చోరీ..

## రాహుల్ హైడ్రోజన్ బాంబ్!



- ఓట్ల చోరీ అంశం పై రాహుల్ గాంధీ పత్రికా సమావేశం
- కాంగ్రెస్ పార్టీ 'హెచ్-ఫైల్స్' అని పేరు పెట్టారు
- బీహార్ తొలి దశ పోలింగ్‌కు ఒక రోజు ముందు ప్రెస్ మీట్
- హైడ్రోజన్ బాంబ్ లోడింగ్ అంటూ ఎక్స్‌లో పోస్ట్
- ఒకే పోలింగ్ బూత్‌లో ఒకే మహిళ పేరు 223 సార్లు ఉంది
- 25 లక్షల ఓట్లు చోరీ జరిగాయని రాహుల్ ఆరోపణ
- హర్యానాలో బ్రెజిల్ మోడల్ కు 22 ఓట్లు ఉన్నాయన్నారు

**విశాలభారతి, నేషనల్:**

ఎన్నికలలో జరిగిన అవకతవకలు, ఓట్ల చోరీ అంశంపై ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలతో కూడిన పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. దీనికి కాంగ్రెస్ పార్టీ 'హెచ్ ఫైల్స్' అని పేరు పెట్టింది. బీహార్‌లో తొలి దశ పోలింగ్‌కు కేవలం ఒక రోజు ముందు ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్ అధికారిక ఎక్స్ (గతంలో ట్విట్టర్) ఖాతాలో ఈ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను ఉద్దేశించి "హైడ్రోజన్ బాంబ్ లోడింగ్" అంటూ పోస్ట్ చేయడం ఉత్కంఠ రేపింది. హర్యానాలో మొత్తం ఓటర్లు 2 కోట్లు కాగా, 25 లక్షల ఓట్లు చోరీ జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. అంటే హర్యానాలోని ప్రతి 8 మంది ఓటర్లలో ఒకరు ఫేక్ అని ఆయన వివరించారు. ఈ కారణంగానే కాంగ్రెస్ ఓడిపోయిందని ఆయన అన్నారు. ఈ 25 లక్షల ఓట్ల చోరీ ఐదు వేర్వేరు కేటగిరీలలో జరిగిందని, 5 లక్షల 21 వేలకు పైగా నకిలీ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

ఒకే పోలింగ్ బూత్‌లో ఒకే మహిళ పేరు 223 సార్లు నమోదైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ మహిళ ఎన్నిసార్లు ఓటు వేశారో ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక యువతి ఫోటోను ఉపయోగించి, వేర్వేరు పేర్లతో (సీమా, సరస్వతి వంటి పేర్లతో) 22 చోట్ల ఓట్లు వేసినట్లు ఆరోపణలు చేశారు. "ఈ బ్రెజిలియన్ మహిళ హర్యానా ఓటర్ల జాబితాలో ఎందుకు ఉంది?" అని ప్రశ్నించారు. ఓటరు జాబితాలో నకిలీ ఫోటోలతో ఉన్న ఓటర్లు 1 లక్షా 24 వేల 177 మంది ఉన్నారని, ఒకే మహిళ తొమ్మిది చోట్ల ఓటు వేసిందని అన్నారు.

హర్యానా ఎన్నికల చరిత్రలో మొదటిసారిగా పోస్టల్ బ్యాలెట్, వాస్తవ ఓట్ల ధోరణి విభిన్నంగా ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లను మాత్రమే పరిగణించినట్లయితే కాంగ్రెస్‌కు 76 సీట్లు, బీజేపీకి కేవలం 17 సీట్లు మాత్రమే లభించేవని ఆయన వివరించారు. పోస్టల్ బ్యాలెట్‌లో, ఎగ్జిట్ పోల్స్‌లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని చూపినా, చివరకు కాంగ్రెస్ 22,779 ఓట్ల తేడాతో ఓడిపోయిందని, మొత్తం మీద లక్షకు పైగా ఓట్ల వ్యత్యాసం ఉందని అన్నారు.

ఈ ఓట్ల చోరీకి ఉద్దేశం స్పష్టంగా ఉందిఅది బీజేపీకి సహాయం చేయడమేనని అని రాహుల్ గాంధీ ఆరోపించారు. బూత్‌లో ఏం జరిగిందో బయటపడకుండా

:మిగతా 2లో..

# దమ్ముంటే నాతో చర్చకు రా..!

## జూబ్లీహిల్స్ అభివృద్ధిపై కేటీఆర్ నివేదిక

- జూబ్లీహిల్స్ ప్రగతి వేదిక పేరుతో కార్యక్రమం
- సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు
- అభివృద్ధి పై చర్చకు రావాలని సవాలు విసిరారు
- జూబ్లీహిల్స్ బైపోల్స్ లో కాంగ్రెస్ ఓటమి ఖాయం
- ముస్లింలను సీఎం రేవంత్ అవమానించారు



విశాలభారతి, స్టేట్ బ్యూరో: బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ లో జరిగిన అభివృద్ధి గురించి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివేదిక విడుదల చేశారు. 'జూబ్లీహిల్స్ ప్రగతి వేదిక' పేరుతో తెలంగాణ భవన్ నిర్వహించిన కార్యక్రమంలో వాటిని వివరించారు.

:మిగతా 2లో..



## రెడ్డి, రావులు ఎవరున్నా హైదరాబాద్ మాదే

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాజకీయ ఉత్కంఠ
- అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు
- మజ్లిస్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతోంది
- మజ్లిస్ నేరుగా ప్రచారంలో పాల్గొనడం లేదు
- రెడ్డి లేదా రావు ఎవరికీ అనుచరులం కాదన్నారు
- హైదరాబాద్ పై పెత్తనం తమ చేతుల్లోనే ఉంటుంది

02

# రాజీనామాకు సిద్ధంగా ఉండు

## కేసీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి

- షేక్‌పేట్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం
- నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు
- బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోంది
- జూబ్లీహిల్స్‌లో రూ.400 కోట్లతో అభివృద్ధి
- సవాళ్లు విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటు
- పీజేఆర్ కుటుంబానికి కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
- కిషన్ రెడ్డి కింగ్ కాలేరని ఎద్దేవా చేశారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని.. ఇది ప్రజలను మోసం చేయడమేనని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. షేక్‌పేట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో సీఎం మాట్లాడారు.

:మిగతా 3లో..

# ఒక్క అవకాశం ఇవ్వండి

- బీహార్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రియాంక గాంధీతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు
- ఒక్కసారి మహాగఠ్ బంధన్‌కు అవకాశం ఇవ్వండన్నారు
- ఎన్డీయే కూటమికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు
- ప్రజలను కొత్త కొత్త హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం



02

# ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్
- ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు
- మారిమల్ల అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది
- ఘటనా స్థలంలో భారీ సంఖ్యలో ఆయుధాలు
- మెయిన్‌పూర్ అడవుల్లో కీలక మావోయిస్టులు మృతి
- ఈ ఏడాది 461 మంది మావోలు లొంగిపోయారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. ఇరువైపుల నుంచి వరుసగా కాల్పులు చోటుచేసుకున్నాయి. బీజాపూర్‌లోని అనారం, మర్రిమల్ అడవుల్లో ముగ్గురు నక్సల్స్ ను జవాన్లు హతమార్చారు. అన్నారం, మారిమల్ల అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరుగుతోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ముగ్గురు నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలం నుంచి భారీ సంఖ్యలో ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

ఇటీవల గరియాబంద్‌లో రూ.కోటి రూపాయల రివార్డు ఉన్న మావోయిస్టు మరణించిన సంగతి తెలిసిందే. గరియాబంద్ జిల్లాలోని

:మిగతా 2లో..

# రైతులకు న్యాయం జరగడం లేదు

- భీంగల్ మండలంలో కల్వకుంట్ల కవిత పర్యటన
- నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు
- అనంతరం రాజకీయాలపై తీవ్రంగా మాట్లాడారు
- రైతుల సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు
- తడిసిన వరి పంటను కూడా కొనడం లేదు
- ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమైన నాయకురాలైన కల్వకుంట్ల కవిత, తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలిగా, కార్తీక మాసంలో పవిత్రమైన పౌర్ణమి రోజున భీంగల్ మండలంలోని లింబాద్రి గుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ ఆలయం నిజామాబాద్ జిల్లాలో ఉన్న ఒక ప్రసిద్ధ క్షేత్రం, ఇక్కడి ప్రభావవంతమైన దైవిక శక్తి భక్తులను ఆకర్షిస్తుంది. కవిత స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

:మిగతా 2లో..





02

## రేవంత్ రెడ్డీ.. ఈ హామీల సంగతేంటి?

### బీజేపీ అభ్యర్థికి మద్దతుగా కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారం

- సీఎం రేవంత్ రెడ్డిపై సంచల వ్యాఖ్యలు చేశారు.. రేవంత్ రెడ్డి వచ్చినా అవినీతి తగ్గలేదన్నారు
- బీసీలకు ఇస్తానన్న లక్షకోట్లు ఎక్కడికి పోయాయి

# రెడ్డి, రావులు ఎవరున్నా హైదరాబాద్ మాదే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక రాజకీయ ఉత్కంఠ రేపుతున్న సమయంలో ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు, చేశారు. "రెడ్డి లేదా రావు.. తాము ఎవరికీ అనుచరులం కాదని.. ఎవరు పరిపాలించినా హైదరాబాద్ పై పెత్తనం తమ చేతుల్లోనే ఉంటుందని వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మకం అయ్యారని .. ఆ వర్గాన్ని ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలు పాట్లు పడుతున్నాయి. ముస్లిం వర్గాల్లో మంచి పట్టు ఉన్న మజ్లిస్ ఈ సారి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతోంది. నవీన్ యాదవ్ ను గెలిపించాలని అసదుద్దీన్ ఓవైసీ గతంలో ఓ సారి ప్రకటన చేశారు. అయితే మజ్లిస్ నేరుగా ప్రచారంలో పాల్గొనడం లేదు. మజ్లిస్ పార్టీ విధానం ప్రకారం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో సన్నిహితంగా ఉంటుంది. కేసీఆర్ తో కలిసి పదేళ్ల పాటు కలసి మెలిసి రాజకీయాలు చేశారు. ఆ పార్టీ ఓడిపోవడంతో బీఆర్ఎస్ పార్టీకి దూరమై కాంగ్రెస్ పార్టీకి సన్నిహితమయ్యారు. పాత బస్తీలో మరో పార్టీ బలపడకుండా.. తమ బలం కాపాడుకునేలా మజ్లిస్ ఈ రాజకీయాలు చేస్తూ ఉంటుంది. అక్కడ ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇతర పార్టీలు బలపడకుండా చూసుకుంటాయి. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించకపోతే .. ఆ పార్టీ మజ్లిస్ బచావో తెహరిక్.. ఎంబీటికి మద్దతు ఇస్తే.. మజ్లిస్ కు పాతబస్తీలో గట్టి సవాల్ ఎదురవుతుంది. ఇటీవలి ఎన్నికల్లో ఎంబీటీకి మంచి ఓట్లు వస్తున్నాయి. సుదీర్ఘ



కాలంగా పాతబస్తీపై పెత్తనం చేస్తున్న మజ్లిస్ పై అక్కడి ఓటర్లలో వ్యతిరేకత ప్రారంభమయింది.కానీ ప్రత్యామ్నాయం ఎవరూ ఉండకుండా.. మజ్లిస్ అధికారంలో ఉన్న పార్టీతో అంటకాగి.. వారికి అవసరమైన మద్దతు ఇచ్చి .. హైదరాబాద్ లో తమ పట్టు మాత్రం కొనసాగిస్తూ ఉంటారు.

ఇప్పుడు కూడా అక్బరుద్దీన్ అదే చెబుతున్నారు. రావు లేదా రెడ్డి తెలంగాణలో ఎవరు సీఎంగా ఉన్నా.. హైదరాబాద్ పై పెత్తనం తమకే ఉంటుందని నేరుగా చెబుతున్నారు. అంటే అధికార పార్టీకి ఓటేయాలని... తమ పెత్తనం పోదని ఆయన ముస్లింలకు సంకేతం ఇచ్చారని అనుకోవచ్చంటున్నారు. అయితే మజ్లిస్ నేరుగా మద్దతు ప్రకటిస్తే.. తమకు ఇతర వర్గాల నుంచి వ్యతిరేకత వస్తుందన్న కారణంగా ఏమో కానీ కాంగ్రెస్ మాత్రం బహిరంగంగా మజ్లిస్ మద్దతు మాకేనని చెప్పడం లేదు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ తరపున జూబ్లిహిల్స్ నుంచే పోటీ చేసి.. రెండో స్థానంలో నిలిచారు.

తమ అవకాశవాదాన్ని ప్రధాన పార్టీల చేతకానితనాన్ని మజ్లిస్ పార్టీ చాలా సులువుగా ప్రజల ముందు ఉంచుతోంది. అక్బరుద్దీన్ ఓవైసీ తాజాగా చేసిన ప్రకటన దీనికి సంకేతం. రెడ్డి లేదా రావు ఎవరు ఉన్నా.. వారికి తాము అనుచరులం కాదని.. హైదరాబాద్ పై పెత్తనం మాత్రం తమదేనని అక్బరుద్దీన్ చెబుతున్న వీడియో వైరల్ గా మారింది. మజ్లిస్ నేతలు అర్ధరాత్రి తర్వాతే ఏదైనా మీటింగ్ లు పెడతారు. అలా పెట్టిన ఓ కార్యక్రమంలో అక్బరుద్దీన్ ఈ వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ కు మద్దతివ్వాలని మజ్లిస్ నిర్ణయించింది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఆ పార్టీకి మద్దతిచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి ఆ పార్టీకి మద్దతిస్తున్నారు. తమ జోలికి రాకుండా.. అధికారంలో ఉన్నపార్టీతో టై అప్ అయిపోయి.. లోపాయికారీ రాజకీయాలు చేసి మజ్లిస్ బ్రదర్స్.. మాదే హైదరాబాద్ అని గప్పాలు కొట్టుకుంటున్నారు. అటు బీఆర్ఎస్ అయినా.. ఇటు కాంగ్రెస్ అయినా.. తాము మజ్లిస్ జోలోకి వెళ్లకుండా.. పాతబస్తీలో అడుగు పెట్టకుండా ఒప్పందం చేసుకుని.. ఇతర చోట్ల మాత్రం మజ్లిస్ మద్దతును పొందుతూ ఉంటాయి. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తమ అవకాశవాదాన్ని ఇలా ఇతర పార్టీల మీద పెత్తనంగా మజ్లిస్ బ్రదర్స్ చెప్పుకోవడం వారికే చెల్లుతుంది.

# ఒక్క అవకాశం ఇవ్వండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రెండు దశాబ్దాల పాటు అవినీతి అక్రమాలు అవకాశవాద రాజకీయాలతో బీహార్ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని బీహార్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపారన్ జిల్లా చనుపటియా అసెంబ్లీ నియోజకవర్గంలో బుధవారం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంక గాంధీ తో కలిసి మంత్రి పొంగులేటి ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్డీయే కూటమికి ఓటమి భయం పట్టుకుందని అందువల్లే అలవికాని హామీలను ఇస్తుందని విమర్శించారు.

వారి ఎన్నికల ప్రణాళికలో కోటి వరాలు ప్రకటించడం, యువతకు కోటి ఉద్యోగాలు, కోటి మంది లక్‌పతి దీదీలు హామీలు ఇచ్చారని అధికారంలో ఉన్న ఈ 20 సంవత్సరాలలో ఏన్ని ఉద్యోగాలు ఇచ్చారు, ఎంతమంది దీదీలను లక్ పతులుగా చేశారని, అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు వీటిని అమలు చేయలేదని ప్రశ్నించారు. బీహార్ ప్రజలను కొత్త కొత్త హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహాగట్ బంధన్‌ను గెలిపిస్తే తెలంగాణ మోడల్ పాలనను బీహార్‌లో అందిస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని వివరించారు. రైతులకు రుణమాఫీ , 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయిలకే సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. బీహార్ ప్రజలు ఈ సారి విజ్ఞతతో ఆలోచించి మహాగట్ బంధన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మహాగట్ బంధన్‌ను గెలిపిస్తే యువకుడైన తేజస్వియాదవ్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయాన్ని ప్రకటించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. బీహార్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా మహాగట్ బంధన్ పనిచేస్తుందని, యువత మహిళలు రైతులు, కార్మికులు అందరూ కలిసి మహాఘట్ బంధన్‌కు చారిత్రాత్మక గెలుపును అందించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మహాఘట్ బంధన్ తరపున సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్, డిప్యూటీ సీఎంగా సహానీ పేర్లను కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ ప్రకటించారని తెలిపారు. కానీ ఎన్డీఏ కూటమి తరపున సీఎం అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించలేని దుస్థితిలో ఉన్నారని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. ఇప్పటికే మహాగర్ బంధన్ ఎన్నికల ప్రణాళిక, ప్రచారాన్ని చూస్తే ప్రజలు ఈ సారి కొత్తపాలనను కోరుకుంటున్నట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయని, బలమైన అభ్యర్థులు రంగంలో ఉన్నందున గెలుపు తథ్యమని మంత్రి పొంగులేటి జోస్యం చెప్పారు.

# రేవంత్ రెడ్డీ.. ఈ హామీల సంగతేంటి?

- **బీజేపీ అభ్యర్థికి మద్దతుగా కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారం**
- **సీఎం రేవంత్ రెడ్డిపై సంచల వ్యాఖ్యలు చేశారు**
- **రేవంత్ రెడ్డి వచ్చినా అవినీతి తగ్గలేదన్నారు**
- **ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల ఎక్కడ ఇచ్చారు**
- **బీసీలకు ఇస్తానన్న లక్షకోట్లు ఎక్కడికి పోయాయి**
- **డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వకుండా మోసం చేశారు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణను పదేళ్లపాటు కేసీఆర్ కుటుంబం పాలించినా నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, కేవలం కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం ఎర్రగడ్డ డివిజన్ లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన.. కేసీఆర్, సీఎం రేవంత్ లపై విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్రంలో సీఎం పదవిలోకి కేసీఆర్ పోయి రేవంత్ రెడ్డి వచ్చినా అవినీతి తగ్గలేదని, ఇంకా ఏ ముఖం పెట్టుకుని రేవంత్ ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు.



పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వకుండా వాళ్లు మాత్రం ఫామ్ హౌస్ లు కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల గురించి అడిగితే మహిళలకు ఇచ్చిన ఫ్రీ బస్సు గురించి మాట్లాడుతున్నార న్నారు. ఆ జాబ్ క్యాలెండర్, బంగారం కానుకలు ఎక్కడికి పోయాయి? అమలు చేయని హామీలు ఇందిరమ్మ ఇళ్లు, రూ.2,500 సంగతి ఏంటి ? అని కిషన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో ఇప్పటి వరకూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు గెలిచినా అభివృద్ధి చేయలేదన్నారు. విద్యార్థులకు ఇస్తానన్న రూ.5 లక్షల భరోసా క్రెడిట్ కార్డు ఎక్కడికి పోయింది? దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఆర్థిక సహాయం చేస్తానన్న రేవంత్ రెడ్డి.. ఒక్క కుటుంబానికైనా ఆ సహాయం చేశాడా? చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు ఇస్తానన్న లక్షకోట్లు ఎక్కడికి పోయాయి? ఈ అంశాలపై రేవంత్ రెడ్డి ప్రచారంలో ఎందుకు మాట్లాడటం లేదు? డబుల్ బెడ్రూమ్ పై కేసీఆర్ నోరు మెదపడం లేదన్నారు.

బీజేపీ ,బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం లేకపోతే ఈనెల 11లోగా సీబీఐతో కేసీఆర్, హరీశ్‌రావును అరెస్ట్ చేయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సవాలు విసిరిన విషయం తెలిసిందే. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే వాళ్లిద్దరినీ 48 గంటల్లో జైల్లో వేస్తామన్న కిషన్‌రెడ్డి కేసు సీబీఐకి ఇచ్చి 3 నెలలు గడుస్తున్నా ఎందుకు ఆ పని చేయడం లేదని నిలదీశారు. ఈ నేపథ్యంలోనే సీఎం చేసిన వ్యాఖ్యలపై ఇవాళ కిషన్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముందు రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుపై చర్చకు రావాలన్నారు. బీజేపీ పార్టీ కాళేశ్వరం విచారణపై ఎన్నికల్లో హామీ ఇవ్వలేదని కామెంట్ చేశారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన డిక్లరేషన్లు, 420 హామీలపై డిబేట్‌కు రావాలన్నారు. తమపై అకారణంగా ఆరోపణలు చేయడం సరికాదని ప్రజలకు వారు ఏం చేస్తున్నారో హితవు పలికారు.

# నేడే బీహార్ పోలింగ్

**( మొదటిపేజీ తరువాయి )**

సుపౌల్, అరారియా, మాధేపుర వంటివి ఉన్నాయి. 2020 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ 125 స్థానాలు గెలుచుకుంది, మహాఘట్‌బంధన్‌కి 110 వచ్చాయి. ఈసారి కూడా పోటీ నువ్వా, నేనా అన్నట్లుగా ఉంది.

పోలింగ్ ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఎన్నికల సంఘం దాదాపు 5 కోట్ల మంది ఓటర్లకు వోటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్స్ (వీఐఎస్) పంపింది. ఇవి ఓటర్లకు పోలింగ్ బూత్ సీరియల్ నంబర్, తేదీ, సమయం వంటి వివరాలు అందిస్తాయి. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అసూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్ (ఏఎమ్ఎఫ్) అందుబాటులో ఉంటాయి. ర్యాంపులు, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్లు, షేడ్, సైన్‌లాంగ్వేజ్ ఇంటర్‌ప్రెటర్లు, వీల్‌చైర్‌లు ఉంచారు. మొత్తం 50,000కి పైగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. వీటిలో 1,000కి పైగా మహిళల కోసం పనిచేసే ప్రత్యేక బూత్‌లు ఉన్నాయి. పోలింగ్ సమయం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. ఓటర్ ఐడీ కార్డ్ (ఈపీఐసీ) లేకపోతే ఆధార్, పాన్, పెన్షన్ కార్డ్, డ్రైవర్ లైసెన్స్ వంటి 11 పత్రాలు ఉపయోగించవచ్చు. మొదటి దశలో జరిగే 17 జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవు ఉంది. భద్రతా ఏర్పాట్ల కోసం 2 లక్షల మంది పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు మొత్తం 50,000కి పైగా డ్యూటీలో ఉంటారు. డ్రోన్‌లు, సీసీటీవీలతో పోలింగ్ స్టేషన్లను మానిటర్ చేస్తారు.



ప్రచారం అద్భుతంగా సాగింది. నిన్న ముగిసిన తొలి దశ ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 8 ర్యాలీలు, పట్నాలో రోడ్‌షో నిర్వహించారు. మళ్లీ తమకే అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా ఆరు ర్యాలీలు చేశారు. అభివృద్ధి, ఉపాధి, చట్టవ్యవస్థపై దృష్టి సారించారు. మహాఘట్‌థ్‌బంధన్‌కు చెందిన రాహుల్ గాంధీ గయాలో ర్యాలీ చేసి, 'ఓట్లు దొంగిలించాలని ఎన్డీయే కుట్ర పన్నుతోంది' అని ఆరోపించారు. తేజస్వీ యాదవ్ 'జంగిల్ రాజ్'కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని చెప్పారు. ప్రచారంలో వ్యక్తిగత ఆరోపణలు, హాలోవీన్, చాథ్ పండుగలకు లింక్ చేసి.. సెటైరికల్ జోక్స్ వేశారు. మొత్తంగా హైవోల్టేజ్ ప్రచారం ఓటర్లను ఉత్సాహపరిచింది. కూటముల సీట్ల సర్దుబాట్లు ఆసక్తికరంగా ఉన్నాయి. ఎన్‌డీఏలో జెడీయూ, బీజేపీ ప్రతి ఒక్కటి 101 స్థానాలకు పోటీ పడుతున్నాయి. మిగిలిన 41 స్థానాలు హిందుస్తాన్ అవామి మోర్చా (హామ్), లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) వంటి చిన్న పార్టీలకు కేటాయించారు. 2020తో పోలిస్తే జెడీయూకు ఎక్కువ సీట్లు లభించాయి. మహాఘట్‌బంధన్‌లో ఆర్‌జేడీ ప్రధాన పాత్ర పోషిస్తోంది. కాంగ్రెస్ 61 స్థానాలకు పోటీ పడుతోంది, సీపీఎం 12, సీపీఐ 4, వీఐపీ 5 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. సీటు విభజనలో కొంచెం ఆలస్యం, భాగస్వామ్యాల మధ్య గొడవలు జరిగాయి కానీ ఫైనలైజ్ అయ్యాయి. మొదటి దశలోని 121 స్థానాలకూ మహాఘట్‌బంధన్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికలు బీహార్ రాజకీయాల్లో కీలక మలుపు తిరగనున్నాయి. ఓటర్లు భారీగా పాల్గొని, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం కోరింది.

# 25 లక్షల ఓట్ల చోరీ..

**( మొదటిపేజీ తరువాయి )**

ఉండేందుకే సీసీటీవీ ఫుటేజ్‌ను తొలగించారని ఆరోపించారు. 'హెచ్‌ఫైల్స్' పేరుతో నిర్వహించిన పత్రికా సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఓట్ల చోరీపై గణాంకాలతో పాటు, ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్పై కూడా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితాలో అక్రమాలపై సీఈసీ దేశ ప్రజలకు బహిరంగంగా అబద్ధం చెప్పారని ఆయన ఆరోపించారు. న్నికల కమిషన్ ప్రెస్ కాన్ఫరెన్స్ వీడియోను ప్రదర్శిస్తూ రాహుల్ గాంధీ ఈ ఆరోపణలు చేశారు. ఇల్లు లేని వ్యక్తుల కోసం (నిరాశ్రయుల కోసం) ఓటర్ల జాబితాలో 'హౌస్ నంబర్ జీరో (0)' నమోదు చేయబడుతుందని సీఈసీ జ్ఞానేష్ కుమార్ గతంలో పేర్కొన్నట్లు రాహుల్ గాంధీ గుర్తు చేశారు. హౌస్ నంబర్ జీరోకు సంబంధించి సీఈసీ ఇచ్చిన సమాచారం వాస్తవం కాదని ఆయన ధ్రువీకరించారు.

నకిలీ ఓట్ల అంశంలో బీజేపీతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉదహరిస్తూ రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. దాల్‌చంద్ అనే వ్యక్తి ఉత్తరప్రదేశ్‌లోనూ ఓటరుగా, హర్యానాలోనూ ఓటరుగా ఉన్నారని రాహుల్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయన కుమారుడు కూడా హర్యానాలోనూ, యూపీలోనూ బీజేపీకి ఓటు వేసే విధంగా రెండు చోట్ల ఓటరుగా ఉన్నారని ఆరోపించారు. బీజేపీతో సంబంధం ఉన్న వేలాది మంది ప్రజలు ఈ విధంగా రెండు రాష్ట్రాలలో లేదా అనేక చోట్ల ఓటర్లుగా ఉన్నారని ఆయన తెలిపారు. మధుర సర్పంచ్ అయిన ప్రహ్లాద్ పేరు కూడా హర్యానా ఓటర్ల జాబితాలో చాలా చోట్ల నమోదైందని ఆయన పేర్కొన్నారు. హర్యానాలో బ్రెజిల్ మోడల్‌కు ఓటు హక్కు కలిగి ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకే అసంబ్లీ సెగ్మెంట్లో 10 బూత్ లలో వివిధ పేర్లతో 22 ఓట్లు కలిగి ఉంది ఈ మోడల్. ఈమె పేరు మథ్యూస్ ఫెరెరో. ఫ్యాషన్ ఫోటో గ్రాఫర్, మోడల్ అయిన ఫెరెరో పేరు లిస్టులో ఉండటంతో ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ సెర్చింగ్ లోకి వచ్చింది. బ్లూ జాకెట్ వేసుకుని ఉన్న ఫోటో.. 2017 మార్చి 02న పబ్లిష్ అయిన ఫోటో అది. ఈ ఫోటోకు 59 మిలియన్ల వ్యూస్ తో పాటు 4 లక్షల డౌన్ లోడ్స్ ఉన్నాయి.



హర్యానాలో జరిగినట్లు బీహార్ లో కూడా జరుగుతుందని రాహుల్ గాంధీ మండిపడ్డారు. బీహార్‌లో తొలి దశ పోలింగ్‌కు ముందు ఈ అంశాన్ని లేవనెత్తడం ద్వారా, ఆ రాష్ట్ర ఓటర్ల జాబితాలో కూడా భారీగా అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఓటరు జాబితాను తమకు చివరి క్షణంలో మాత్రమే ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. టుంబాల పేర్ల తొలగింపు: రాహుల్ గాంధీ పత్రికా సమావేశ వేదికపైకి బీహార్‌కు చెందిన కొందరు ఓటర్లను తీసుకువచ్చారు. వారి పేర్లు ఓటరు జాబితాల నుంచి తొలగించబడ్డాయని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, మొత్తం కుటుంబాల పేర్లు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించబడ్డాయని ఆయన వివరించారు. ర్యానా మాదిరిగానే బీహార్‌లో కూడా లక్షలాది మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని రాహుల్ గాంధీ తెలిపారు.

# ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**( మొదటిపేజీ తరువాయి )**

మెయిన్‌పూర్ అడవుల్లో భద్రతా దళాల కాల్పుల్లో కీలక మావోయిస్టులు హతమయ్యారు. మెయిన్‌పూర్ ప్రాంత అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం అందడంతో, గరియాబంద్ ఈ30,ఎస్‌టీఎఫ్, కోబ్రా బృందాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా దళాలు, నక్సలైట్ల మధ్య అడపాదడపా ఎన్‌కౌంటర్‌లు కొనసాగుతున్నాయి. కాగా, కీలక మహిళా నేత సునీతక్క మరికొందరు మావోయిస్టులతో కలిసి ఛత్తీస్ గఢ్ పోలీసుల ఎదుట సరెండర్ అయిన సంగతి తెలిసిందే. లొంగిపోయిన మావోయిస్టుల మీదున్న రివార్డులను పోలీసులు అందించారు. సునీతక్క 2022లో మావోయిస్టు పార్టీలో చేరి మాడ్ ప్రాంతంలో 6నెలల పాటు శిక్షణ పొందారు. అనంతరం పార్టీలో కీలక నేతగా ఎదిగి అనేక దాడుల్లో కీలక పాత్ర పోషించారు.



ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. భద్రతా దళాలు అదనపు బలగాలను రంగంలోకి దించి, ఆ ప్రాంతంలో విస్తృత గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. ఎదురుకాల్పుల్లో ఎంతమంది మావోయిస్టులు మరణించారు, లేదా గాయపడ్డారు అనే దానిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ ఘటన బీజాపూర్ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలకు ఇది మరో తీవ్రమైన ఎదురుదెబ్బగా పరిణమించనుంది. ఈ ఆపరేషన్‌లో పోలీసుల వ్యూహాత్మక ప్రణాళిక విజయవంతం అయినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలు సంచలనం సృష్టిస్తున్నాయి. కేవలం బీజాపూర్ జిల్లాలోనే ఈ ఏడాది 461 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అదే సమయంలో 138 మంది ఎదురుకాల్పుల్లో హతమైతే, 485 మంది అరెస్టు అయ్యారు. ఇటీవల కంకేర్, బీజాపూర్‌లో ఏకంగా 72 మంది మావోయిస్టులు ఒకేసారి ఆయుధాలు వదిలి లొంగిపోవడం గమనార్హం. మావోయిస్టు పార్టీలో పెరుగుతున్న అంతర్గత కలహాలు, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి కారణంగానే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టులు లొంగుబాటు బాట పట్టారు. ఇప్పటికే ఛత్తీస్ గడ్ అడవుల్లో జరుగుతున్న మహా యుద్ధంలో అనేకమంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా, ప్రభుత్వం ఊపిరాడనివ్వకుండా చేస్తున్న దాడి నేపథ్యంలో పలువురు మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులను మట్టుపెట్టి పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేసిన క్రమంలో లొంగిపోయిన చాలామంది మావోయిస్టులు, ఇంకా మిగిలి ఉన్న వారిని కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ సంవత్సరం జరిగిన ఎన్కౌంటర్లలో 249మంది నక్సలైట్లను మట్టి పెట్టినట్టు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబల కేశవరావు వంటి అగ్ర నేతలు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఇక వరుస దెబ్బలతో బలహీనపడిన మావోయిస్టులు, ఈ ఫ్యాక్టరీ ద్వారా పెద్ద ఎత్తున ఆయుధాలు తయారు చెయ్యాలని చూశారు కానీ మేము వారి ప్రయత్నాన్ని సమాధి చేసామని ఎస్పీ స్పష్టం చేశారు.

# రైతులకు న్యాయం జరగడం లేదు

**( మొదటిపేజీ తరువాయి )**

"కార్తీక పౌర్ణమి సందర్భంగా భీంగల్ మండలంలోని లింబాద్రి స్వామి ఆలయంలో పెద్ద ఉత్సవం జరుగుతుంది. చాలా పవర్‌ఫుల్ దేవుడు. స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చాం" అని ఆమె చెప్పారు.

కవిత ఆలయం విశిష్టత గురించి చెప్పారు. "నిజానికి లింబాద్రి ఆలయం కాదు, నింబాద్రి. చాలా మహిమ గల దేవుడు. వేప చెట్లు ఉన్నాయని నింబాద్రి అంటారు. కాలక్రమేణా లింబాద్రిగా పేరు వచ్చింది" అని వివరించారు. ఈ ఆలయం చరిత్రలో లక్ష్మీ నరసింహస్వామి వారి అద్భుత మహిమలు చాలా ఉన్నాయని చెప్పారు. భక్తులు ఇక్కడికి వచ్చి ప్రార్థనలు చేస్తే జీవితంలో సుఖ శాంతులు లభిస్తాయని ఆమె నమ్మకంగా చెప్పారు. "ఈ దేవుడి దయ వల్ల నిజామాబాద్ ప్రజలు, తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి" అని ఆశీర్వచనం చేశారు. కార్తీక పౌర్ణమి రోజున ఆలయంలో భక్తుల దర్శనం, పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. దర్శనం అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత రాజకీయ, సామాజిక అంశాలపై కూడా తీవ్రంగా మాట్లాడారు. ఈ ప్రాంతం రాష్ట్రంలో కీలకమైన కాంగ్రెస్ నాయకులకు చెందినదని పేర్కొన్నారు. "ఈ మండలానికి సంబంధించి పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ గారు ఉన్నారు. మరో ముగ్గురు కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా ఈ ప్రాంతం వారే" అని చెప్పారు. ఇక్కడి ఎమ్మెల్యే పదవి పట్టించుకుని, రూలింగ్ పార్టీ నడుస్తోందని, కానీ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవటం లేదని విమర్శించారు. మక్కా పంటకు సంబంధించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు: "మక్కలు 80 శాతం కొన్న తర్వాత ఇప్పుడు కాంటా పెడుతున్నారు. ఇది దారుణం, అన్యాయం." తడిసిన వరి పంటను కూడా కొనడం లేదని, ప్రభుత్వం హామీ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇటీవలయంచ గ్రామాన్ని సందర్శించిన తర్వాత కలెక్టర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారని, అలాగే అన్ని ప్రాంతాలకు అధికారులు చేరాలని కోరారు.



బాల్కొండ ప్రాంతంలో కొన్ని చెక్‌డ్యామ్‌లు డ్యామేజ్ అవ్వడంతో పంటలు మునిగిపోయాయని, ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇస్తామని ధైర్యం చెప్పడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నట్టు కనిపించడం లేదని, ఇక్కడి ఎమ్మెల్యే రైతులకు మేలు చేసే ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి విషయంలో కూడా కవిత ముందుంచారు. మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ లక్ష్మీ నరసింహ స్వామి భక్తుడని, గతంలో లింబాద్రి స్వామి ఆలయానికి రూ. 5 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. "దాంతో గుడిని అభివృద్ధి చేసుకున్నాం" అని చెప్పారు. అయితే, అక్కడి మహిళలకు టాయిలెట్లు, ఛేంజింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉందని, గుట్ట కింద అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ పూర్తి కావటానికి రూ. 20 లక్షలు అవసరమని ప్రభుత్వాన్ని కోరారు. పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలని సూచించారు.

# దమ్ముంటే నాతో చర్చకు రా..!



**( మొదటిపేజీ తరువాయి )**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో కేటీఆర్ విరుచుకుపడ్డారు. గత పదేళ్లలో జూబ్లీహిల్స్ ను నిర్లక్ష్యం చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి పై చర్చించేందుకు తనతో చర్చకు రావాలని సీఎం రేవంత్ కు సవాలు విసిరారు.

**ఓటమి భయంతోనే దూషణలు**

హైదరాబాద్ లోని అసెంబ్లీ, సచివాలయం, గాంధీ భవన్ ఎక్కడైనా సరే రేవంత్ తో చర్చకు తాను సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరాశ, నిస్పృహతో ఉన్నారు. 'జూబ్లీహిల్స్ బైపోల్స్ లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్ కు అర్థమైంది. అందుకే నాపై రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణకు దిగారు. ఓటమి తప్పదని భావించి రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారు. ఆయన కంటే గట్టిగా మాట్లాడగలను. రేవంత్ కు సమాధానం చెప్పే సత్తా ఉంది. కానీ కేసీఆర్ సూచనతోనే రేవంత్ పై వ్యక్తిగత దూషణకు దిగటం లేదు' అని కేటీఆర్ అన్నారు.

**'డ్రగ్ కల్చర్ పెరిగింది'**

బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులను ప్రజలకు చెప్పమని కేసీఆర్ తనకు చెప్పినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. 'నన్ను వ్యక్తిగతంగా తిట్టినా ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్ ను గౌరవిస్తున్నా. హోంశాఖను చూస్తున్న రేవంత్ రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయి. హైదరాబాద్ లో గన్, డ్రగ్ కల్చర్ పెరిగింది. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిపోయింది. అండర్ పాస్ లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించాం. కాంగ్రెస్ వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలి. పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించాం. కాంగ్రెస్ వచ్చాక ఒక గుంత కూడా పూడ్చలేదు' అని కేటీఆర్ మండిపడ్డారు.

**లై డిటెక్టివ్ టెస్టుకు సిద్ధం**

సీఎం అంటే కటింగ్ మాస్టర్ మాదిరి రేవంత్ వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సిటీలో మళ్ళీ మంచి నీటి కష్టాలను కాంగ్రెస్ తీసుకొచ్చింది. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి మేము శ్రీకారం చుట్టాం. మెట్రో నిర్మించిన ఎల్ అండ్ టీని రేవంత్ రెడ్డి బెదిరించి పంపించారు. తనపై ఉన్న ఏసీబీ కేసులో రేవంత్ వస్తే.. ఫార్ములా ఈ రేస్ కేసులో నేను లై డిటెక్టివ్ టెస్ట్ కు రెడీ. ఫార్ములా ఈ రేసు కేసులో విషయం లేదు కాబట్టే గవర్నర్ అనుమతి ఇవ్వాలంటున్నారు. నా ప్రాసిక్యూషన్ కు గవర్నర్ ఎప్పుడో అనుమతి ఇచ్చారు' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ లేకపోతే ముస్లింలు లేరన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేటీఆర్ చెప్పారు. అలా చెప్పడం ద్వారా ముస్లింలను సీఎం అవమానించారని మండిపడ్డారు. 'ముస్లిం సమాజానికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి. లేకుంటే కాంగ్రెస్ కు ఎలా సమాధానం చెప్పాలో ప్రజలు నిర్ణయించుకుంటారు. కాంగ్రెస్ పుట్టక ముందు నుంచీ ముస్లింలు ఉన్నారు. సీఎం రేవంత్.. తన అజ్ఞానం నుంచి బయటకు రావాలి. బీజేపీ లేకపోయినా హిందువులు ఉంటారు. కాంగ్రెస్ లేకపోయినా ముస్లింలు ఉంటారు' అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

## కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు

- హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్
- కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి,కొప్పుల నర్సింహారెడ్డి



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** హయత్ నగర్ ప్రాంతంలోని కార్తీక పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప దేవాలయంలో నిర్వహించిన సత్యనారాయణ వ్రతం పూజా కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ దీక్ష స్వాములకు బుధవారం రోజు నుండి మధ్యాహ్నం నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని స్థానిక హయత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.నాగరాజు గౌడ్ ,హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , మంసూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి,కళ్లెం రవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కార్తీక పౌర్ణమి పవిత్రమైన రోజున అయ్యప్ప స్వామి భక్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హయత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు ప్రత్యేకంగా వారి కుటుంబ సమేతంగా సత్యనారాయణ వ్రత పూజ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాదాకంగా భావించారు.మాలధారణ చేసిన స్వాములకు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తి, సేవా పరంపరకు నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ స్థానికులు ప్రవీణ్ రెడ్డి,నక్క వెంకటేష్ గౌడ్,కళ్లెం శంకర్ రెడ్డి,చెన్నగొని రమేష్ గౌడ్,తాడిచెట్టు సునీల్ గౌడ్,నక్క రాజేష్ గౌడ్,పారంద సాయి,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివలింగాలకు పూజ చేయాలంటే డబ్బులు చెల్లించాల్సిందే

- ఆలయ అధికారులు దృష్టి పెట్టాలి



**కీసర, విశాలభారతి:** కీసర గుట్ట ఆలయం బయట ఉన్న శివలింగాలకు భక్తులు పూజలు చేయాలి అంటే డబ్బులు చెల్లించాల్సిందే అంటున్న స్వామీజీలు. కార్తీక పౌర్ణమి వేళ బుధవారం కీసర గుట్టలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో అలాగే ఆలయం బయట ఉన్న శివలింగాలకు వారు తెచ్చుకున్న పాలు,పెరుగుతో అభిషేకాలు చేస్తూ కార్తిక దీపాలు వెలిగిస్తారు.కానీ కొందరు స్వామిజీలు ఈ శివలింగం వద్ద పూజ కార్యక్రమాలు చేయాలి అంటే డబ్బులు చెల్లించాలి లేదంటే వేరే వద్ద చేసుకో అంటూ భక్తులను ఇబ్బందులు పెడుతున్నారు.ఆలయ బయట ఉన్న శివలింగాలకు పూజలు చేయాలి అంటే డబ్బులు చెల్లించాల్సిందే అంటే ఎలా అని ఆలయ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఎంత సేపు ప్రధాన ఆలయంలో ఉన్న స్వామి వారినే కాకుండా బయట ఉన్న శివలింగలపై కూడా దృష్టి పెట్టాలని ఆలయ అధికారులను కోరుతున్న భక్తులు. ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బయట ఉన్న శివలింగల వద్ద కొందరు స్వామీజీలు డబ్బులు వసూలు చేస్తున్నారు అనే విషయం మా దృష్టికి ఇప్పుడే వచ్చింది అని తెలిపారు.

## హైడ్రా చర్యలు అభినందనీయం

**హైడ్రాకు మద్దతుగా ర్యాలీ చేపట్టిన ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ సభ్యులు**



**గండిపేట్, విశాలభారతి:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలను కాపాడటం గొప్ప విషయమని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ ఆర్డబ్ల్యూఏ అధ్యక్షుడు వంశీ తెలిపారు. హైడ్రాకు మద్దతుగా ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ ఆర్డబ్ల్యూఏ తరఫు నుంచి మణికొండ మర్రిచెట్టు వద్ద ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, వెస్ట్రన్ ప్లాజా సమీపంలో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వం భూములను, పార్క్ స్థలలను అన్యక్రాంతం నుండి హైడ్రా కాపాడిందని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ ఆర్డబ్ల్యూఏ అధ్యక్షుడు వంశీ తెలిపారు. హైడ్రాలో ఫిర్యాదు చేసిన వెన్నువెంటనే స్పందించి ప్రజలకు ఉపయోగకరంగా ఉండే పార్కులను కాపాడినందుకు మణికొండ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మణికొండ ప్రజలు ఎప్పుడు హైడ్రాకు కృతజ్ఞత కలిగి ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ అవినాష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకం

**గుగులోత్ ప్రకాష్ స్వామి ఇంట్లో భక్తి పర్వంగా పడిపూజ, భిక్ష కార్యక్రమం**

**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని కందికొండ ఎడ్జెర్ల గ్రామంలో ఈరోజు కార్తీక పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప భక్తి ఉత్సాహంతో నిండిపోయింది. గ్రామంలోని ప్రసిద్ధ అయ్యప్ప స్వాముల పీఠంలో భక్తుడు గుగులోత్ ప్రకాష్ స్వామి స్వయంగా ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే భజనలతో, "స్వామియే శరణం అయ్యప్ప" ఘోషలతో పీఠం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగిపోయింది. అదేవిధంగా గుగులోత్ ప్రకాష్ స్వామి తన నివాసంలో భక్తి భావంతో పడిపూజా కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం స్వామి మాలధారులందరికీ భిక్ష ఏర్పాటు చేసి, అన్నప్రసాదం పంపిణీ చేశారు. భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు ఆనందంగా భిక్ష తీసుకొని, ప్రకాష్ స్వామి కుటుంబానికి అయ్యప్ప స్వామి అనుగ్రహం కలగాలని ప్రార్థించారు. అదేవిధంగా గ్రామ ప్రజలు, స్వాములు ఈ కార్యక్రమంలో భాగస్వాములై భక్తి పరవశంలో మునిగిపోయారు. కార్తీక పౌర్ణమి పవిత్ర సందర్భంలో గుగులోత్ ప్రకాష్ స్వామి చేపట్టిన ఈ సేవా కార్యక్రమం గ్రామంలో భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు.







# ఊపందుకున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం

- నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా యశస్విని ఝాన్సీ రెడ్డిల ప్రచారం

**తొర్రూరు, విశాలభారతి:**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో భాగంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించగా, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి యూసఫ్ గూడా డివిజన్ పరిధిలో డోర్ టు డోర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ యశస్విని రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రజలంతా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నవీన్ యాదవ్ ని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, జూబ్లీహిల్స్ ని యోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నవీన్ యాదవ్ తోనే సాధ్యమని అన్నారు.

## మహిళా రక్షణకే షీ టీమ్స్

- మౌనంగా ఉండొద్దు.. ఫిర్యాదు చేయండి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, విశాలభారతి:**



మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, మహిళల రక్షణకే షీ టీమ్స్ పనిచేస్తున్నాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రెండు షీ టీం బృందాలు పనిచేస్తున్నాయని, షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్, కాలేజీలలో ర్యాగింగ్/ఈవ్ టీజింగ్/పోక్సో/ గుడ్ టచ్ బ్యాడ్ టచ్/ఆత్మహత్యలు/డ్రగ్స్ /బాల్య వివాహాలు/వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయల్ 100, టీ సేఫ్ యాప్ మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్లైన్, క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ ద్వారా కూడా స్వీకరిస్తారని తెలిపారు. మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకర పోస్టులు పెట్టే వారు, సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలు బాలికలు విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. ఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, విద్యార్థినులు, మహిళలు అత్యవసర పరిస్థితులలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్, మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి లేదా వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సీపీ సూచించారు.

## 'సింగరేణి'లో భద్రతా ప్రమాణాల పరిశీలన



**నస్పూర్, విశాలభారతి:**

సింగరేణి భద్రత ప్రమాణాలపై ఫైవ్ స్టార్ రేటింగ్ తనిఖీ బృందం పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిని బుధవారం ఓ ఎస్ డి. కోల్ కంట్రోల్ అధికారి రాజేందర్ చోలే, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం. మధుసూదన్, టి జి జెన్కో. పి. మోహన్ రావు, ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ పి. శ్రీధర్, ఓఎస్డి కోల్ కంట్రోలర్ అధికారి కొత్తగూడెం ఏ. కృష్ణమోహన్ రావు సభ్యుల బృందం పరిశీలించారు. శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు గనులలో తీసుకుంటున్న భద్రతా చర్యలు, కార్మిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, చర్యల గురించి వివరించారు. ఆర్ కె 6 యూనిట్ రికార్డులను పరిశీలించారు. కమిటీ సభ్యులు సింగరేణి సంస్థ గనుల భద్రతా ప్రమాణాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ బీభత్సా, ఆర్కే7, గ్రూప్ ఏజెంట్ రాజేందర్, ఉపరితల గనుల అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ యోజన పనిముట్ల పంపిణీ



**నిర్మల్, విశాలభారతి:**

కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన విశ్వకర్మ యోజన పనిముట్లను పట్టణంలోని మంజులాపూర్‌లో లబ్ధిదారులకు బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోడీ విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించి రూ.కోట్లు ఖర్చు చేసి వారికి శిక్షణ ఇస్తున్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ చేతివృత్తుల కళాకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కృషి ఫలితంగా ఈ పథకం ద్వారా అన్ని చేతి వృత్తుల వారికి పనిముట్లు అందించనున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో ఈ పథకాన్ని మరింత కింది స్థాయికి తీసుకెళ్లి అర్హులందరికీ పనిముట్లు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ఆయిండ్ల రమేష్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జైల లింగం, కరుణాసాగర్, కడారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

**ముథోల్/నిర్మల్, విశాలభారతి:**

మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీమాత -దామోదరుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి 365 వొత్తులు, ఇంటి ముందు దీపాలను వెలిగించారు. ఎడ్బిడ్ గ్రామంలో శివలయం వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని పండితుడు బసవరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు తులసి చెట్ల వద్ద దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్థానిక ఆలయాలకు మహిళలు హారతులతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బస్సులో అకస్మాత్తుగా పొగలు

- బెంబేలెత్తిన ప్రయాణికులు
- మెయింటెనెన్స్ లేని ఆర్టీసీ అద్దె బస్సులు
- పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఆరోపణలు



**సత్తుపల్లి, విశాలభారతి:** సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సులో ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురైన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఖమ్మం నుండి సత్తుపల్లికి వస్తున్న టీఎస్ 04 యూడీ 1167 నంబర్ బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు కొంత దూరం ప్రయాణించిన తర్వాత ఇంజిన్ వైపు నుంచి భారీగా పొగ రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. బస్సు లోపల పొగ కమ్మేయడంతో భయంతో ప్రయాణికులు కిందికి పరుగెత్తి బయటకు వచ్చారు. పరిస్థితిని గమనించిన డ్రైవర్, కండక్టర్ అప్రమత్తంగా బస్సును రోడ్డుకు పక్కన ఆపినందువల్ల పెద్ద ప్రమాదం తప్పింది. తరువాత ఇంజిన్‌ను పరిశీలించగా వాటర్ పంప్ జామ్ కావడంతో ఇంజిన్ వేడెక్కి, ఫ్యాన్ బెల్ట్ తెగిపోవడం వలన పొగలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో బస్సుల మెయింటెనెన్స్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అద్దె బస్సులను సక్రమంగా నిర్వహించకపోవటంతో ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



**డోర్నకల్, విశాలభారతి:** డల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా డీఎస్పీ తిరుపతి రావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్ , లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్‌రూం, పరిసరాలను పరిశీలించారు. గంజాయి, నల్లబెల్లం, నేర వాహనాలు, పెండింగ్ కేసులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేశారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలని చెప్పారు. అలాగే స్థానిక సంస్థలు ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని పల్లెల్లో నిఘా నేత్రాలు అమర్చేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్సైలు వంశీధర్, గడ్డం ఉమా, సిబ్బంది పాల్గొన్నారు.

## భారత గడ్డపై సీపీఐకి వందేళ్ళ చరిత్ర



**హనుమకొండ, విశాలభారతి:** భారత గడ్డపై సీపీఐకి వందేళ్ల చరిత్ర ఉందని.. ఈనెల 18, 19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో జరిగే రాష్ట్ర బస్ జాతను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి భిక్షపతి పిలుపునిచ్చారు. బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం సమావేశమై మాట్లాడారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి పోరాడిన చరిత్ర సీపీఐది అన్నారు. అధికారం లేకున్నా ప్రజల హక్కుల కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందుకోసం ప్రతి ప్రజా సంఘం నడుం బిగించాలని చెప్పారు. ఈ సమావేశంలో మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ఎ స్టాలిన్, మునిగాల భిక్షపతి, బత్తిని సదానందం, జక్కు రాజు గౌడ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టపాక రవి, వేల్పుల సారంగపాణి, కామెర వెంకట రమణ, గుంటి రాజేందర్, యాళ్ళ సంజయ్, కండె నర్సయ్య, దామెర సుదర్శన్, అలువాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంలో కార్తీక దీపోత్సవం



**నల్లబెల్లి, విశాలభారతి:** మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, కార్తీకదీప మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అర్చకులు కృష్ణ స్వామి నేతృత్వంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో వ్రతంలో పాల్గొన్నారు. దీపారాధన, దీపోత్సవ కార్యక్రమాలు వైభవంగా సాగాయి. దేవాలయ ప్రాంగణం దీపాలతో కళకళలాడింది. వ్రతాంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. రామాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. భక్తులు సాయంత్రం వరకు హారతులలో పాల్గొని భక్తి భావంతో శ్రీ సీతారాములను దర్శించుకున్నారు.


విశాల భారతి
తెలుగు దిన పత్రిక





## మఫ్టీపోలీస్ వచ్చేస్తున్నాడు..

యాక్షన్ కింగ్ అర్జున్ ,ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ చేస్తున్న సినిమా 'మఫ్టీ పోలీస్' జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆర్ట్స్ బ్యానర్ లో నిర్మితమౌతున్న ఈ సినిమాతో దినేష్ లెట్చుమనన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇటీవల 'మఫ్టీ పోలీస్' టీజర్ విడుదలైంది. అప్పటి నుండి సినిమా అంచనాలు పెరిగాయి. ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకుల ఊహకు అందని ట్విస్ట్ లు ఉంటాయని తెలుస్తోంది. ఇందులో అర్జున్ చెప్పే 'కొన్నిసార్లు చట్టాన్ని దాటి న్యాయం ఉంటుంది. ఇంకొన్నిసార్లు న్యాయాన్ని దాటి ధర్మం ఉంటుంది. కానీ మొత్తం లెక్కవేసి చూస్తే చివరికి ధర్మమే గెలుస్తుంది' అనే డైలాగ్ మూవీ సెంటర్ పాయింట్ ను తెలియచేసే విధంగా ఉంది. ఎప్పటి లానే యాక్షన్ కింగ్ అర్జున్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ చేశారు. ఐశ్వర్య రాజేష్ క్యారెక్టర్ లో ఇంటెన్సిటీ కనిపిస్తోంది. ఈ యేడాది సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీలో మిడిల్ క్లాస్ హౌస్ వైఫ్ గా నవ్వుల పువ్వులు పూయించిన ఐశ్వర్య రాజేష్ ఇందులో పూర్తి భిన్నమైన పాత్రను పోషించినట్టు అర్థమౌతోంది.'మఫ్టీ పోలీస్' చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అభిరామి, రామ్‌కుమార్, జి. కె. రెడ్డి, పి. ఎల్. తేనప్పన్, లోగు, వేల రామమూర్తి, తంగదురై, ప్రాంక్‌స్టర్ రాహుల్, ఓ.ఎ.కె. సుందర్ తదితరులు ఇతర ప్రధాన పాత్రలను పోషించారు.



## జటాధర నుంచి కొత్త ట్రైలర్

నటుడు సుధీర్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జటాధర'. ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్ & అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. వెంకట్ కళ్యాణ్ కథనందిస్తున్నాడు. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా కీలక పాత్రలో నటించబోతుంది. నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం విడుదలకు సంబంధించిన అన్ని పనులను పూర్తి చేసుకుంటుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా కొత్తగా రిలీజ్ ట్రైలర్‌ను వదిలింది. మైథాలాజికల్, సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రైన్ అంజలి, శిల్పా శిరోడ్కర్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. జీ స్టూడియో సమర్పణలో ఉమేశ్ కె.ఆర్.భన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



## హైదరాబాద్‌లో ప్రియాంకా చోప్రా.. ఎస్ఎస్ఎంబీ 29 ఈవెంట్ కోసమేనా..?

గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 మహేశ్ బాబు లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రం ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రాబోతుంది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు.హైదరాబాద్ శివారులోని రామోజీ ఫిలింసిటీలో నవంబర్ 15న సాయంత్రం 6 గంటల నుంచి గ్రాండ్ ఈవెంట్ ఏర్పాటు చేశారని తెలిసిందే. ఈవెంట్ నేపథ్యంలో హైదరాబాద్‌లో ల్యాండ్ అయింది ప్రియాంకా చోప్రా. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులు, ఫాలోవర్లతో షేర్ చేసుకుంది. అయితే ప్రియాంకా చోప్రా టైటిల్ ఈవెంట్ ప్రిపరేషన్ కోసమే హైదరాబాద్ వచ్చిందా..? లేదంటే షూటింగ్‌లో జాయిన్ అయ్యేందుకా..? అనేది తెలియాల్సి ఉంది. మరి ఎస్ఎస్ఎంబీ 29 టీం ఏదైనా అప్‌డేట్ ఇస్తుందేమో చూడాలి.

## మగాళ్లకి కూడా పీరియడ్స్ వస్తే బాగుండు..

ఈ ఏడాది ఇండియన్ సినీ పరిశ్రమలో రష్మిక మందన్నా సందడి ఎక్కువగా కనిపిస్తోంది. నెల, రెండు నెలల గ్యాప్‌లో ఓ సినిమా విడుదల చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటివరకు ఆమె నటించిన నాలుగు సినిమాలు థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించాయిఈ ఏడాది ఇండియన్ సినీ పరిశ్రమలో రష్మిక మందన్నా సందడి ఎక్కువగా కనిపిస్తోంది. నెల, రెండు నెలల గ్యాప్‌లో ఓ సినిమా విడుదల చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటివరకు ఆమె నటించిన నాలుగు సినిమాలు థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించాయి. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'పుష్ప 2' తో రష్మిక తన సత్తా చాటుకోగా, ఈ ఏడాది 'ఛావా', 'సికందర్', 'కుబేర', 'థామా' చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో రష్మిక పలు ప్రమోషనల్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. షోలు, ఇంటర్వ్యూలలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తోంది.తాజాగా ఆమె జగపతిబాబు హోస్ట్‌గా రన్ అవుతున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షోలో పాల్గొని సందడి చేసింది. ఈ సందర్భంగా రష్మిక తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంటూ, స్కూల్ రోజుల్లో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసింది. జగపతిబాబు అడిగిన ప్రశ్నలకు రష్మిక ఇచ్చిన సరదా సమాధానాలు ప్రేక్షకులను అలరించాయి. అంతేకాకుండా, షోలో రష్మిక మహిళలకు సంబంధించిన సమస్యలపై మాట్లాడింది. "మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని అనిపించింది. ఆ సమయంలో మహిళలు ఎదుర్కొనే నొప్పి, బాధ ఎలా ఉంటుందో అబ్బాయిలు కూడా అనుభవిస్తే వారికి అర్థం అవుతుందని చెప్పి అందర్నీ ఆకట్టుకుంది. ఆమె మాటలకు జగపతిబాబు, ఆడియెన్స్ ఇద్దరూ చప్పట్లు కొట్టారు.





## ఖిలాడి భామతో వన్స్‌మోర్..

రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులకు ఫుల్ మీల్స్ లాంటి పసందైన వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. ఇప్పటికే విడుదలైన మాస్ జాతర బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తోన్న చిత్రం RT76. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.ఇటీవలే స్పెయిన్‌లో షూటింగ్ కొనసాగుతున్నట్టు తెలియజేస్తూ రవితేజ టీం రిలీజ్ చేసిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. స్పెయిన్‌లో సాంగ్ షూట్ పూర్తి చేసినట్టు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది రవితేజ టీం. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. ఈ మూవీలో ఖిలాడి ఫేం డింపుల్ హయతి కూడా నటిస్తోంది. లొకేషన్‌లో రవితేజతో దిగిన సెల్ఫీని షేర్ చేస్తూ.. చార్ట్ బస్టర్ అంటూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ విషయాన్ని షేర్ చేసింది డింపుల్ హయతి.ఈ సాంగ్ షూట్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ ప్రాజెక్టు 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.